శ్రీలేఖ మాస పత్రిక : నవంబర్, 2002

# అల - వల - నవల

సూర్యం, అలసిపోయి, గోడకు జారగిలబడ్డాడు. మరుక్షణం, కళ్ళు మూతలు పడ్డాయి.

మగత - అలసట - నిరాశ - అంధకారం - బ్రతుకుపై జుగుప్స.

పంట పొలాలు - కొబ్బరి తోటలు - నిండుగా పారే కాలువలు - బారులుగా ఎగిరే కొంగలు - గోదావరి నదీ పాయ - ఇసుక తెన్నెలు - పడవలు -

ఎన్నో దృశ్యాలు, అలలు అలలుగా! జ్ఞాపకాలు - అలలు అలలుగా!

"ఇంక చదివించడం, నా వల్ల కాదు! ఇంకా చదివినా ఉద్యోగాలు రావు. ఏదో ఉద్యోగం చూసుకో- నీ బ్రతుకు నువ్వు బ్రతుకు"

తండ్రి ఆవేదన - కాదు ఆజ్ఞే!

పెళ్ళి కెదిగిన చెల్లెళ్ళు-

పదేళ్ళ తర్వాత - తల్లి మరో బిడ్డకు జన్మనిచ్చింది.

తండ్రి తప్పు చేసిన వాడిలా తల వంచుకు తిరగడం, మగతనం శాపంలా!

అర్భకపు ప్రాణికి, పాలు లేవు, గేదె పాలు ఇమడవు. తల్లి కళ్ళల్లో నిరాశ. కడుపు చించుకుని భూమి మీద కొచ్చిన బిడ్డపై మమకారం.

అది ఇల్లు -

బ్రాహ్మణ కొంప

ఆచారాలు - సంప్రదాయం

మూఢత్వం - బ్రతుకుతో నిరంతర పోరాటం

జీవితంపై ఆశ - ఎండ మావుల్లా!

బంగారు భవిష్యత్తుకై ఎదురు తెన్నులు
సూర్యం - వంటి మీద వాలినది దోమో, ఈగో, తెలియదు. చెయ్యెత్తే ఓపిక లేదు.
ఎంత దూరం?
ఏమో-
ఎప్పుడు బయలేదేరాడు?
బస్సు - రైలు - నడక-
ఎంత దూరమో - ఎక్కడికో తెలియని ప్రయాణం.
నల్లగొండ, వరంగల్... ఉద్యోగాలు లేవు - కరీంనగర్ వెళ్లు.
"ఆంద్రోడా!"
"అవునేమో?"
"గీళ్ళకు ఎంత భూమీ చాలదు!"
"అవ్!.. ఉద్యోగాలు అన్నీ తన్నక పోతాండ్రు, లంగలోళ్ళు?"
అవమానాలు - ఛీత్కారాలు.
భుజాన సంచి - సర్టిఫికెట్లు.
"ముల్కి గావాలే! ఉందా!"
"పైసలు బెడతవా?"
"ఏం కులం?"
"ఎంప్లాయిమెంటుకు బో"
ఎక్కడకు పోయినా ఫలితం?
"డిగ్రీ చదివినావ్! గీపోస్ట్"
"అరే భాయి సాబ్ - కైకు ఇత్న దూర్ అయా! చలో.."
తెలుగువారి ఐక్యత - ఆంధ్ర రాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం చేశాడు - చరిత్ర చెబుతోంది!
"తెలుగు వాళ్ళందరూ ఏకం కావాలి" - నాయకులు ఐక్యతగా ఉంటారు.
"ప్రత్యేక తెలంగాణా కావాలీ"
ఎవరి గోల వాళ్ళది.
శ్రీబాగ్ ఒడంబడిక - పెద్దమనుషులు
ఒప్పందం - పదవుల పంపిణీ - ప్రాంతాలు, కులాల ప్రాతిపదికన.
ఉపముఖ్యమంత్రి ఉండాల్సిందే!
రాయలసీమకు అన్యాయం, సహించం!
నదీ జలాల పంపిణీ
హిందూ - ముస్లిముల కొట్లాట

భూసంస్కరణల అమలు
సోషలిజం
సూర్యానికి శోష వచ్చింది.
కళ్ళు తెరిచాడు.
అంతా చీకటి
కనుచూపు మేర దీపాలు లేవు. వెలుతురు లేదు. ప్రాణి కదిలాడిన శబ్దం లేదు.
తనెక్కడున్నాడు?
ఎందుకున్నాడు?
ఆదిలాబాదు - ఎటు వెళ్ళాలి?
అక్కడ ఉద్యోగాలున్నాయా?
ఇస్తారా!
ఆశ - ప్రయాణం - రైలు పోతూనే ఉంది. జనం ఎక్కుతున్నారు, దిగుతున్నారు.
ఎండిన పొలాలు - నీళ్ళు లేవు. కొండలు - గుట్టలు - అడవి - పచ్చని చెట్టు లేదు.
ఆదిలాబాద్‌కు ఎక్కడ దిగాలి?
భాష - తెలుగే, ఒకరికొకరికి అర్థం గాదు. కోటి రత్నాల వీణ మా తెలంగాణ!
ఎప్పుడు ఎక్కడ ఎవరన్నారు?
మాసినగడ్డం, మండుతున్న కళ్ళు
"కమ్యూనిస్ట్ కాదు గదా?"
"ఏమో? రజాకార్ కావచ్చు!"
"ఏ రాత్రో - కాళరాత్రి - అర్థరాత్రి - అపరాత్రి, ఏదైనా కావచ్చు!"
పోలీసులు చెకింగ్, రైడింగ్ - టిక్కెట్ లేనివాళ్ళు దిగారు - ఊహూ దింపారు.
సూర్యాన్నీ దింపారు.
ఎందుకు?
"బాడ్‌కోవ్ - దిగిపో"
రాజ్యహింసా!
శాంతిభద్రతల పరిరక్షణా?
దీపాలు లేవు. మనుషులు లేరు.
అది స్టేషనో - పాడుబడ్డ కొంపో -
బస్ - ఛాయ్ అంతే - ఎప్పటివో!

"వందలు ఖర్చు చేసి ఉపనయనం చేశా, ఏం లాభం? సంధ్యావందనం లేదు, రాదు - కనీసం అన్నం ముందయినా ఔపోసన మంత్రం - చదివడు - కులభ్రష్టుడు పుట్టాడు! ఖర్మ, ఖర్మ"

తాను పుట్టాడా, కావాలని!

ఏమో?

గీత ఏమంటుంది?

ఏమో!

అన్నప్రాసన నాడు ఏం ముట్టాడు? పిల్లాడు

బంగారం - పుస్తకాలు - దేవుడి బొమ్మ- వెండి గిన్నె - కలం!

ఏమో?

పేడతో అలికి ముగ్గులు పెట్టిన కొంప - బంగారంలేదు - వెండిగిన్నె లేదు.

ఉన్నది పుస్తకాలు - భారతం - భాగవతం, రామాయణం - ఇవేగా!

సూర్యం అవే పట్టుకున్నాడుట.

ఆ కుటుంబంలో తొలి గ్రాడ్యుయేటు చౌదరి కొడుకు - పొగాకు కంపెనీ యజమాని!

నాయుడు కొడుకు - కాఫీ హోటల్ ప్రొప్రయిటర్.

దేవదానం కొడుకు - మిలట్రీ.

పంతులు కొడుకు?

సూర్యం కళ్ళు తెరిచాడు-

ఆకలి - కడుపులో మంట - గోదావరికి వరదొచ్చినప్పుడు - సుడులు తిరుగుతూ ఉరకలు వేస్తుంది. ఆకలి భూచక్రంలా తిరుగుతోంది.

ఏడుద్దామంటే - కళ్ళల్లో నీళ్ళు లేవు - ఏనాడో ఇంకిపొయ్యాయి.

విజయనగర వీధుల్లో వజ్రాలు, రత్నాలు అమ్మారు-ట

భారతదేశం రత్నగర్భ-ట

ఆంధ్రప్రదేశ్ అన్నపూర్ణ-ట

సూర్యం నిట్టూర్చాడు.

జనం కలకలం.

ఎక్కడున్నారు జనం - ఏరీ?

ఎదురుగా - హేలు - ఆశ్చర్యం!

వీళ్ళంతా నిరుద్యోగులే భావి భారత పౌరులే!

పదండి ముందుకు

పదండి తోసుకు

హరోం హరా

ఓరి నీయమ్మ - ఏందా తోపుడు?

అలసిపోయి, చతికిలబడ్డాడు, సూర్యం.

అలా ఎంత సేపు- ఎంతకాలం?

"పెళ్ళయిందా?"

"కాలేదు"

"ఈ పిల్లను చూడు - చేసుకో - ఉద్యోగం వేయిస్తా"

బానిసత్వం - బార్టర్ సిస్టం.

ఉద్యోగం ఊడినా - కట్టుకున్నది వదలదు-

పద ముందుకు -

నడచీ - నడవలేక ఎటు పోవాలో తెలియక అరుగు మీద మకాం!

"ఏవర్నాయినా"

సమాధానం నమస్కారం.

ఇంటాయన - ప్రవేశం

శల్య పరీక్ష

ఉత్తరంతో ప్రయాణం

"ఆ ఊరికి రోడ్డు లేదు - ఆ ఊర్లో ఇళ్లుండవు. ప్రాథమిక పాఠశాల - పని చేస్తావా?"

గంగిరెద్దు తలూపింది.

జేబులో ఉద్యోగం.

దారి?

ఆ వూరు పేరు చెబితే - ఇండియాలో ఆంధ్రప్రదేశ్‌లో ఆదిలాబాద్ జిల్లాలో ఆ వూరుందా? ఆశ్చర్యం!

తపాలా శాఖ - తాలూకాఫీసు - పోలీస్ స్టేషన్

అబ్బే - తెలియదు.

నిరాశ - మళ్ళీ మొదలు - కథ మొదటి కొచ్చింది.

అధికారి - ఉద్యోగప్రదాత ముందు హాజరు.

అయ్యా-

"తప్పు జరిగిపోయిందోయ్ - ఈ పేరు చెప్పు- బస్సెక్కి - పలాన చోట దిగు. అక్కడ నుంచి - నడువు"

నిజమా - కలా! అంతదూరం వెళ్ళాక ఆ ఊరు లేకపోతే?

అక్కడ స్కూలే లేకపోతే?

పద్మ వ్యూహం - పోవడమే తిరిగి రావడం ఎందుకు?

ఏం సాధించాలి?

వచ్చాడు-

అలసి పోయాడు.

తుమ్మలు - గుట్టలు - బీడు పడ్డ పొలాలు - అంతా శూన్యం.

అలా పోగా - పోగా.....

గూడెం - కొన్ని పాకలు - గేదెలు - గొర్రెలు - గుడ్డల్లేని పిల్లలు - గుండెలు - గుడ్డతో కప్పుకునేందుకు చాలని స్త్రీలు.

పక్షులు - పశువులు - మానవాకారాలు - వింతగా చూశాయి.

వచ్చింది ఎవరో?

పోలీసా?

కమ్యూనిస్టా?

ఆంధ్రోడా?

సూర్యం ఎదురుగా జనం.

ఆముదపు దీపం వెలుతుర్లో దయ్యాలు - మనుషులు - ఆకారాలు

నిశ్శబ్దం- దోమలు కుడుతున్నాయి.

కుక్కలు అరుస్తున్నాయి. తీతువు పిట్ట వెక్కిరిస్తోంది.

జనం ప్రాణాలు బిగబట్టుకుని చూస్తున్నారు - వింతగా -

"నమస్తే!"

ఆశ్చర్యం, విభ్రమం.

నల్లతుమ్మ చెట్ల మధ్యలోంచి చంద్రోదయం.

వెలుతురు మొహాల్లో అపనమ్మకం-

వచ్చింది - సాధు జంతువు - భయం లేదు-

చూద్దాం తెల్లవారకపోతుందా-

ఆ రాత్రి జొన్న రొట్టె - సత్తు గ్లాసులో నీళ్ళు

దేవతలు - అమృతం తాగి ఆనందించారా?

ఏమో సూర్యం - ఆనందించాడు.

"రోజూ పప్పేనా?"

తండ్రి తినేశేలా చూడడం!

తల్లి నిస్సహాయంగా తలొంచుకోవడం.

ఏదో అసంతృప్తి

మనుషుల్లా పుట్టాం! మనుషుల్లా బ్రతుకుతున్నామా?

సమాధానం ఎవరు చెబుతారు?

"వెధవ కొంప - కూర్చునేందుకు కుర్చీ లేదు. స్నేహితులొస్తే మాట్లాడేందుకు గది లేదు.

"సంపాయించవోయ్! అన్నీ కొను"

గాండ్రింపు

ఆకాశంలో - కోరికలు - భవిష్యత్తుపై కలలు - అలలు.

ఏమైనాయి అవన్నీ?

ఆకలి రుచే ఎరుగదు - నిజం - ఓ సత్యం తెలుసుకున్నాడు, ఈ రోజు.

ఆ జొన్నరొట్టె - ఎంత బావుంది?

కళ్ళల్లో నీళ్ళు-

నాన్న. అమ్మ - చెల్లెళ్ళు - కళ్ళల్లో ప్రాణాలతో చూసే తమ్ముడు - అంతా ఎంత దూరంలో ఉన్నారో-

వీళ్ళు - తమకేం అవుతారు- ఎందుకు తనకి ఆకలి తీర్చారు?

అమ్మ - ఏ రాత్రయినా - "రా అన్నం తిందువుగాని"

"ఆకలి లేదు!"

"మజ్జిగన్నం తిను!"

"రోజూ అదేగా?" - విసుగు?

అమ్మ - మాట్లాడదు - కళ్లు తుడుచుకోవడం!

తండ్రి - అన్నీ విన్నా - విననట్టే ఉంటాడు.

అనుబంధం - ప్రేమ - వాత్సల్యం.

బంధుత్వం - ఇవన్నీ - మనుషుల మధ్య - ఎలా ఏర్పడతాయి? రక్తసంబంధం - కలసి బ్రతకడం వల్లా?

చిన్న తమ్ముడు చిట్టి చేతుల్తో తాకితే - ఊ..ఆ! ఉంగా - అని పలకరిస్తే-

వళ్ళు జలదరింపు-

జొన్నరొట్టె - తింటుంటే - తమ్ముడు గుర్తొచ్చాడు - తల్లి గుర్తొచ్చింది - తండ్రి కూడా గుర్తొచ్చాడు.

"సారూ"

"ఈడ ఏం జేస్తరు - సారూ?"

ఇన్నాళ్లూ 'సార్ - సార్'. అని తిరిగిన సూర్యం - సారయ్యాడు.

"చదువు చెబుతా!"

ముహాముహాలు చూసుకున్నారు.

ఒకే గది - గోడలు పగుళ్ళిచ్చాయి.

ఆ పగుళ్ళలో బల్లులు - ఎలుకలు - బొద్దింకలు - పిచ్చుకలు

తలుపు విరిగిపోయింది - కిటికీలకు తలుపు ల్లేవు.

భావిభారత పౌరులను తీర్చిదిద్దే దేవాలయం -

గది చుట్టు - తామర తంపరగా పిచ్చి చెట్లు - ఎండిన గడ్డి - పగుళ్ళిచ్చిన నేల-

దూరంగా కొద్దిగా నీళ్లు పారే నీళ్ళపాయ - ఇసుక -

ఆ నీళ్ళు త్రాగుతారు. మనుషులు జంతువులతో కల్సి.
సూర్యం స్నానం చేశాడు.
అప్పుడే గమనించాడు - యజ్ఞోపవీతం - నీళ్ళలో పోయింది.
ఉపనయనం వల్ల 'ద్విజుడు' అయినాడు - ఒకప్పుడు.
యజ్ఞోపవీతం పోయింది ఇప్పుడు - మనిషైనాడా?
గది ఊడ్చుకున్నాడు.
పిల్లలు దూరంగా ఉండి చూస్తున్నారు.
'సారు' ఏం చేస్తున్నాడు? అని పిల్లల తల్లిదండ్రులు చూస్తున్నారు.
"సారూ - ఈడ మీరుండలేరు?"
"ఏం తింటారు? ఏడ పండుతారు?"
సూర్యం - రూపం - నిశ్చయిం చూశాక ఎవ్వరూ మాట్లాడలేదు.
పొద్దు పొడుస్తున్నది.
పొద్దు రాలుతున్నది.
గాలి వీస్తున్నది.
కాకులు అరుస్తున్నాయి.
మేకలు - గేదెలు - వస్తున్నాయి.
కొత్త మనిషిని చూసి అవీ భయపడి వెడుతున్నాయి.
సూర్యం - డ్యూటీ చేస్తున్నాడు.
వందేమాతరం
జనగణమణ
సరస్వతీ నమస్తుభ్యం!
గురుబ్రహ్మ-
గంట కొట్టడం - ఎదురు చూడడం-
కొన్నాళ్ళకు గూడెం పెద్దలొచ్చారు -
ఆ తరువాత - ఒకరు - ఇద్దరు పిల్లలు
లోకాభిరామాయణం-
చదువు - ఆవశ్యకత
ధరలు - వాతావరణం - ప్రభుత్వ పథకాలు-
బడి ఆవరణ శుభ్రమైంది! మొక్కలు నాటారు.
సూర్యం - సారు -
గూడెంలో జనం ఆడ - మగ, - పిల్లలు - జంతువులు - పక్షులు - క్రిమికీటకాలు - అన్నిటికీ - సూర్యం -సారు

నెల...

గూడెంలో ఒకే ఒక్క సైకిలు గూడెం ముఖ్యుడు - సూర్యంతో తోడుగా - పదిహేను మైళ్ళు వెళ్ళాడు.

సూర్యం జీతం అందుకున్నాడు.

వంట్లో - ఉత్సాహం - కళ్ళల్లో వెలుగు - మనిషిలో చైతన్యం వచ్చాయి.

సబ్బు - దువ్వెన - నూనె - అద్దం - పలకలు - బలపాలు కొన్నాడు.

తండ్రికి ఉత్తరం రాశాడు.

ఆ రోజు గూడెం - సూర్యాన్ని తమలో ఒకడిగా ఆహ్వానించింది.

దినచర్య ఏర్పడింది.

పిల్లలు బడికి వస్తున్నారు.

పెద్దలు వస్తున్నారు - కష్టాలు - కన్నీటిగాథలు - బ్రతుకు పోరాట గాధలు - దోపిడీ విధానం - చెప్పకుంటున్నారు.

రెండోనెల - మూడోనెల-

సూర్యానికి ఒకే రోజు రెండుత్తరాలు-

"అన్నయ్యా-

నువ్వెళ్ళినప్పట్నుంచీ - నాన్న సరిగ్గా అన్నం తినడం లేదు. నీ మీద బెంగ - అన్నం ముందు కూర్చుని - నువ్వు గుర్తొచ్చేవాడివేమో - సగంలో లేచేవాడు.

ఎటో చూస్తూ - ఏమిటో గొణుక్కుంటూ పరధ్యానంగా ఉండేవాడు.

నీ ఉత్తరం వచ్చాక - నాన్న - సంతోషించాడు. మొహం కప్పకుని కళ్ళు తుడుచుకున్నాడు. అమ్మతో 'వెధవ ఎన్ని కష్టాలు పడ్డాడో - ఉద్యోగం కోసం' అనడం విన్నా. నీకు నాన్న మీద కోపం లేకపోతే - ఓ సారి రా!

అందరం కులాసా"

తండ్రికి - తన మీద ఇంత అప్యాయమైన ప్రేమ ఉందా?

ఏ రోజూ - తిట్టడం - విసుక్కోవడం - చిరాకు పడడం!

అది ప్రేమా? అశక్తతత వల్ల వచ్చిన కోపమా?

ఏమో?

సూర్యం - రెండో ఉత్తరం చూశాడు.

"నాన్న నిన్న చనిపోయాడు"

సూర్యం - గోడకు జారగిలబడ్డాడు - మరుక్షణం కళ్ళు మూతలు పడ్డాయి.

మగత - అలసట - నిరాశ - అంధకారం - బ్రతుకుపై జుగుప్స.

ఎన్నో దృశ్యాలు అలలు అలలుగా!

ఎన్నో జ్ఞాపకాలు అలలు అలలుగా!

నిరంతరం జీవితం
పెళ్ళికెదిగిన చెల్లెళ్ళు!
వళ్ళో పసిబిడ్డతో తల్లి
అది బ్రాహ్మణ కొంప
ఎంత దూరం- ఈ ప్రయాణం!
నడక - బస్సు - రైలు
అనంత యాత్ర.
తండ్రిని పున్నామ నరకం నుంచి తప్పించాలి.
చెల్లెళ్ళు - ఓ ఇంటి వాళ్ళు కావాలి!
తల్లిని ఆదుకోవాలి - తమ్ముడు - తండ్రి లేని వాడనని బాధపడకూడదు-
"సారూ - గెప్పుడొస్తార్!"
"అమ్మను తోలకరా! మేముండాం! ఈడనే ఉంటారు. గిదీ ఊరే సారూ - బతుకుదాం!"
ఎంత అనుబంధం!
కొన్ని నెలలు.
ఓ కులం కాదు - ప్రాంతం కాదు - జీవన విధానమూ ఒకటి గాదు - ఇదేనా భారతీయ జీవన సంస్కృతి?
ఏమో?

♦ ♦ ♦

**వల:**

అలా,
అలల్లా గతం జ్ఞాపకం వచ్చింది!
సూర్యం - తొండ ముదిరి ఊసరవెల్లయినాడు.
ఇరవయ్యేదేళ్ళు
క్రాపు లేదు - పిలక
యజ్ఞోపవీతం - వంట్లో భాగమైంది.
నుదుటున విభూతి -
సూర్యనారాయణమూర్తి - అంటే ఎవరు? అనడుగుతారు.
పంతులు -
తండ్రి అవతారం! తాల్చాడు!
చెల్లెళ్ళు - దూరంగా పిల్లపాపలతో!
తమ్ముడు?
పంతులు - భార్య - ఇద్దరే!

పిల్లలు వద్దనుకున్నారు
ఆదర్శంగా - అవసరం కాదు - అనవసరం.
చెల్లెళ్ళు పెళ్ళిపేరంటం - పురుళ్ళు
తమ్ముడు - కాదు - కొడుకు - చదివించారు.
"ఒరేయ్ నాయినా! వాడు తండ్రి ప్రేమ ఎరుగడు - నేనా గడపదాటని ఆడదాన్ని - వాడి భవిష్యత్తు - నీ చేతుల్లో వుంది"
తల్లి - చచ్చేదాకా - ఒకటే మాట!
ఆ మాట కోసం వలలోపడ్డాడు.
ఒంటెద్దు బండికి కట్టిన ఎద్దులా పంతులు నడుస్తూనే వున్నాడు.
రొయ్యల చెఱువులు -
టీవీలు - స్కూటర్లు - మేడలు - రంగు మారిన రాజకీయాలు -
ఉక్కు- ఆంధ్రుల హక్కు కావాలి ప్రత్యేక తెలంగాణా - అమరవీరుల చిహ్నం దక్కింది.
ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం - రాయలసీమ మాటేమిటి? - చర్చలు గంభీరంగా!
కులాల వారీ పార్టీలు - చీలికలు
డబ్బు చలామణి పెరిగింది.
జీతాలు పెరిగాయి - ధరలు పెరిగాయి!
విద్య వ్యాపారమైంది - అన్ని ధరకు దొరుకుతాయి.
చదువుకున్నవాళ్ళు ఎగిరిపోతున్నారు - డబ్బు కోసం - సుఖాల కోసం
పంతులు అలాగే ఉన్నాడు - వలలో!
బాధ్యతలు మోసి మోసి - ముసలాడయ్యాడు. వయస్సుకన్నా - రెండింతలు.
తమ్ముడు ఇదిగో వస్తాను - అని
దేశం విడిచి వెళ్ళాడు - ఎన్నో ఏళ్ళ క్రితం
తల్లిపోయింది - మంచంలో పడి - తమ్ముడు రాలేదు - తీరికలేక!
వస్తాడా? ఏమో?
ప్రశ్న -
"ఎందుకు రాడండీ - నేను తల్లిలా పెంచా!"
భార్యలో విశ్వాసం!
"వస్తాడు. తను రాలా తండ్రి పోతే - వాడు వస్తాడు" - పంతులు నమ్మకం.
ఎండా కాలం-
వానా కాలం-
కోనసీమలో వానా కాలం

వరదలు - తుపాను - బీభత్సం
తమ్ముడు రాలేదు
ఫించను - చాలు ఇద్దరికీ.
ఇల్లుంది - పాక గాదు - రేకుల ఇల్లు.
తినడం - రేడియో వినడం - గుళ్ళో కెళ్ళడం!
పంచాయితీ ఆఫీసులో పేపరు-
అంచెలంచెలుగా చదవడం - దొరికితే!
గురువారం - దత్తాత్రేయుడు
శనివారం - వేంకటేశ్వరస్వామి
మంగళవారం - ఆంజనేయస్వామి
కార్తీక మాసం-
మాఘ మాసం-
ఉపవాసాలు - నోములు - వ్రతాలు
సుబ్బారాయుడు - షష్టి
నాగుల చవితి
వైకుంఠ ఏకాదశి
శ్రావణ మంగళవారాలు - నోములు
పంతులు - భార్య - ఎదురు చూస్తూనే ఉన్నారు.
తమ్ముడు కోసం -
ఉత్తరాల కోసం -
భవిష్యత్తు కోసం -
ఇది జీవితం కాదు - అనంత యాత్ర-
మధ్యతరగతి - దంపతులు - వలలో చిక్కిన - పక్షులు - అవునా?
అప్పుడు - తపాలా - వారి సమ్మె అయ్యాక-
రెండుత్తరాలు - ఒకే రోజు వచ్చాయి - గాలీ - దుమారంలా!
తమ్ముడు దగ్గర్నుంచి - పంతులుకు
కొడుకు వద్ద నుంచి వదినకు
పంతులు - ఉత్తరాలు చించలేదు.
భార్య - చించి చదవరేం - అనలేదు
ఎందుకంటే -
భయం - భవిష్యత్తు గురించి - భయం.

♦ ♦ ♦

నవల :

ఆ ఉత్తరాల్లో - ఏముందో?

"నేను ఇక్కడే సెటిల్ అయ్యా - పెళ్ళి చేసుకున్నా - పిల్లలు కూడా - బంగళా కారు - ఇండియా రాలేను"

ఓరి కృతఘ్నుడా?

నీవే కొడుకు అనుకున్నామే-

ఇదా నీ నిర్వాకం!

"మీ వదిన నిన్ను అమ్మలా పెంచింది!"

"మీ అన్నయ్య- నిన్ను కొడుకులా పెంచాడు"

భయం - అనుమానంపిరికితనం

రెండో ఉత్తరంలో - ఏముందో గదా!

"డబ్బు కావాలంటే పంపుతా!"

ఏ ఆశ్రమంలోనో చేరండి - నన్ను మటుకు రమ్మని ప్రాణం తీయకండి - ప్రేమలు - అభిమానాలు - బంధుత్వాలు - సెంటిమెంటు - నాకు లేవు - మీ ఇష్టం - ఏదో తేల్చుకొని - ఫైనల్‌గా ఓ సెటిల్‌మెంటుకొద్దాం"

ఆ ఉత్తరాలు - అలాగే ఉన్నాయి - దిక్కు లేనట్లు చించకుండా.

పంతులు చదివాడు, చదివే ఉంటాడు.

అని భార్యకు తెలుసు-

భార్య చదివే ఉంటుంది

అని పంతులు నమ్మకం.

నిజానిజాలు ఆ భార్యాభర్తలకు తెలుసు -

తెలుసని ఒకరినొకరు చెప్పుకోరు - నిజం! భయం!

ఇదే భార్యాభర్తల అనుబంధం - ప్రేమ - అనుకోండి - మీ ఇష్టం!

ఆత్మవంచన చేసుకోండి- చేసుకోకండి!

"దేవుడా! ఆయన జీవితం కుటుంబం కోసం త్యాగం చేశాడు! ఆయన ఆరోగ్యంగా హాయిగా ఉండాలి!" భార్య ప్రార్థన.

"అది అమాయకురాలు - తమ్ముడి కోసం పిల్లలు వద్దనుకుని - మాతృత్వం త్యాగం చేసింది – అది సుఖంగా ఉండాలి" భర్త కోరిక.

వాళ్లది మిధున రాశి కాకపోవచ్చు.

ఈ దేశంలో - సగటు మనుషులు - వాళ్ళు - జీవితంలోంచి - నవల.

నవల లాంటి జీవితం.

ఇదో జీవన స్రవంతి - ఇలా సాగుతూనే ఉంటుంది - అనంతంగా.... •